క్లుప్తంగా

8న చంద్రగిరి మండల సమావేశం

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఆగస్టు 8న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేష్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

భీమేశ్వర స్వామికి విశేష పూజలు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లులోని మాణిక్యాంబదేవి సమేత భీమేశ్వర స్వామి, తలకోన సిద్ధేశ్వర స్వామి ఆలయాల్లో సోమవారం విశేష పూజలు చేశారు. తెల్లవారుజామునే స్వామి, అమ్మవార్లను సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. చండీయాగం, రుద్రాభిషేకం, కలశపూజ చేశారు. మూడవ శ్రావణ సోమవారం కావడంతో మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి దీపాలు వెలిగించారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

భాకరాపేట: తుడా ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో దేవేంద్రబాబు పేర్కొన్నారు. ఆయన సోమవారం అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 13 పంచాయతీల్లో తుడా ఆధ్వర్యంలో సీసీ రోడ్డు, మురుగు కాలువలు, మట్టి రోడ్లు, బీటీ రోడ్లు, ధ్యాన మందిరాలు, మంచినీటి శుద్ధి కేంద్రాలు నిర్మిస్తున్నట్టు తెలిపారు. అలాగే శ్మశానవాటికలను అభివృద్ధి చేస్తున్నట్టు పేర్కొన్నారు.

అసోసియేట్ డీన్‌గా జగపతి రామయ్య



జగపతి రామయ్యను సత్కరిస్తున్న అధ్యాపకులు

తిరుపతి సిటీ: తిరుపతి వెటర్నరీ యూనివర్సిటీలోని పశువైద్య కళాశాల ఫిజియాలజీ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ డీన్‌గా జగపతి రామయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఆ విభాగం ఉద్యోగులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాంబాబు, డాక్టర్ శివకుమార్, డాక్టర్ వరప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

భాకరాపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు భాకరాపేట ఎస్ఐ ప్రకాష్‌కుమార్ తెలిపారు. భాకరాపేట సమీపంలోని నెమిలిగుండ్ల వద్ద ఉన్న మెగా కంపెనీలో ఆపరేటర్‌గా పని చేస్తున్న ముఖేష్‌చౌదరి(37) ఆదివారం రాత్రి కార్యాలయానికి నడుచుకుంటూ వెళుతుండగా పీలేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని కంపెనీకి చెందిన కార్మికులు, పోలీసులు 108లో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ అతను సోమవారం ఉదయం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


జేబు దొంగకు జైలు

తిరుపతి లీగల్: తిరుమలలో ఓ వ్యక్తి జేబులోని సొమ్మును చోరీ చేసిన కేసులో కృష్ణా జిల్లా పోరంకి మండలం తుషానం కట్టకు చెందిన డి.గోపికి రెండు నెలల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వర రావు సోమవారం తీర్పు చెప్పారు. ఈ ఏడాది జూన్ 19వ తేదీన విశాఖపట్నం జిల్లాకు చెందిన యాకూబ్ తిరుమల రెండో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద ఉన్నాడు. అతని ప్యాంట్ జేబులోని రూ.9,500 చోరీకి గురైంది. అతని ఫిర్యాదు మేరకు తిరుమల వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు గోపి, మరొకరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడు గోపి నేరం అంగీకరించడంతో న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

వైఎస్సార్ బీమా అందజేత

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం ఐతేపల్లి పంచాయతీ పులిత్తివారిపల్లెలో మూడు రోజుల క్రితం క్యాన్సర్‌తో మృతిచెందిన బాబు కుటుంబానికి ప్రభుత్వం వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష మంజూరు చేసింది. ఈ క్రమంలో సోమవారం తక్షణ సాయం కింద రూ.10 వేలను వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి, సర్పంచ్ ఫాజిల్లా అందజేశారు. పార్టీ కన్వీనర్లు కిషోర్, నాగరాజు, నాయకులు రాజశేఖర్ రెడ్డి, అంజాద్, బాబు, పంచాయతీ కార్యదర్శి చంద్రబాబు పాల్గొన్నారు.

వారపు సంతలో అన్నదానం



పాకాల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వారపు సంతలో సోమవారం రైతులకు, చిరు వ్యాపారులకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నదానం చేశారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నలు ఆకలితో ఉండకూడదన్న ఉద్దేశంతో సంతలో అన్నదానం చేస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు.

మేలు చేసిన జగనన్నకే మా మద్దతు

- హామీ ఇచ్చిన 19వ డివిజన్ వాసులు
- మంచిన చేసిన వారిని గుర్తు పెట్టుకుంటారు : ఎమ్మెల్యే భూమన
- గడప గడపకూ మన ప్రభుత్వానికి విశేష ఆదరణ



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

తిరుపతి మంగళం: మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇస్తామని తిరుపతి 19వ డివిజన్ ఎంఆర్‌పల్లి వాసులు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సోమవారం మేయర్ శిరీష, కార్పొరేటర్ ఆరణి సంధ్యతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. జగనన్న మీ కుటుంబానికి మేలు చేసి ఉంటే వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇచ్చి ఓట్లు వేయాలని స్థానికులను అభ్యర్థించారు. స్థానికులు మాట్లాడుతూ గతంలో సిఫార్సు ఉంటేనే పథకాలు అందేవని, ఇప్పుడు అర్హత ఉంటే ఇంటి వద్దకే పథకాలు అందజేస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు తప్పకుండా మద్దతు ఇస్తామని వెల్లడించారు. ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ దేశమే మెచ్చేలా జగనన్న పాలన సాగిస్తున్నారని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నారని వివరించారు. వివిధ పథకాలతో ప్రతి గడపకూ రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు లబ్ధి కలిగినట్టు పేర్కొన్నారు. మంచి చేసిన వారిని ఎవరైనా గుర్తు పెట్టుకుంటారని, అనేక పథకాలు అమలు చేసిన జగనన్నను ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, టౌన్ బ్యాంక్ డైరెక్టర్లు మబ్బు నాదమునిరెడ్డి, రేమాల బ్రహ్మానందరెడ్డి, దేవదానం, తిమ్మారెడ్డి, పడమటి కుమార్, కిషోర్, సద్దాబాబు, కైలాస్, రవి, నారాయణ, ఉమాపతి, జయచంద్రారెడ్డి, నాగయ్య, ధనుంజయ, కంకణాల రమేష్ పాల్గొన్నారు.

గడప గడపలో చెవిరెడ్డి లక్ష్మికి ఘన స్వాగతం



సప్తగిరినగర్‌లో పర్యటిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి మంగళం: చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి చేపట్టిన గడప గడపలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తోంది. ప్రజలు ఆమెకు ఘనంగా స్వాగతం పలుకుతున్నారు. ఆమె సోమవారం వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, మహ్మద్‌కాసీమ్ ఆధ్వర్యంలో మంగళం సప్తగిరినగర్ పంచాయతీలో గడపగడపకూ వెళ్లి స్థానికులతో మాట్లాడారు. చేసిన మేలు చెబుతూ.. చేయాల్సిన పనుల గురించి తెలుసుకున్నారు. తన భర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన మేలు గుర్తు పెట్టుకుని తన బిడ్డ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఆదరించి గెలిపించాలని కోరారు. తిరుమలనగర్ పంచాయతీ ఇన్‌చార్జ్ గుండ్రాజు శివశంకర్‌రాజు, ఎంపీటీసీ లక్ష్మయ్య, హరికృష్ణ, మల్లెమొగ్గల ఉమాపతి, రమేష్,మల్లెల నాగరాజు, వార్డు మెంబర్లు మంజుల, దీపశ్రీ, కవిత, వెంకటసుబ్బమ్మ, మురగ, మహేశ్వరరెడ్డి, మణి, సుధ పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి
మంగళం రణధీర్‌పురం పంచాయతీలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని చెవిరెడ్డి లక్ష్మి పరిశీలించారు. ఉచిత వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆచార్య గణపతి భట్‌కు సాధకశ్రీ బిరుదు

తిరుపతి సిటీ: రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం అద్వైత వేదాంత విభాగం ఆచార్యులు గణపతి భట్‌కు సాధకశ్రీ–2023 బిరుదు లభించింది. కర్ణాటకలోని ప్రాచీన మఠం హరిహరపుర క్షేత్రం శ్రీ ఆదిశంకరాచార్య శారద లక్ష్మీనరసింహ పీఠం పీఠాధిపతులు స్వయంప్రకాశ సచ్చిదానంద సరస్వతి స్వామి తమ చతుర్మాస దీక్ష సందర్భంగా ఆదివారం బెంగళూరులో విద్వత్ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి భట్‌కు బిరుదు అందజేసి సత్కరించారు. ఆయన న్యాయ వేదాంత జ్యోతిష్య శాస్త్రాలను ఔపోసన పట్టారు. గతంలో ఆయన కంచి, శృంగేరి, మంత్రాలయం వంటి ప్రతిష్ఠ మఠాల్లో జరిగిన విద్వత్ సభల్లో పాల్గొని అనేక పురస్కారాలు అందుకున్నారు.

‘ఆడుదాం ఆంధ్ర’ పోటీలకు సిద్ధంకండి

చంద్రగిరి(తిరుపతి రూరల్): మండలంలో అక్టోబర్ రెండో తేదీ నుంచి 48 రోజులు ఆడుదాం ఆంధ్ర పేరిట క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్టు ఎంపీపీ హేమెంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో గ్రామస్థాయి నుంచి క్రీడా పోటీలు నిర్వహిస్తామని, ఇందుకు సిద్ధం కావాలని సూచించారు. వార్డు స్థాయి నుంచి పంచాయతీ స్థాయి, అక్కడి నుంచి మండల స్థాయి, అక్కడి నుంచి జిల్లా స్థాయి వరకు పోటీలు ఉంటాయని వెల్లడించారు. క్రీడాకారులు తమ పేర్లను గ్రామ సచివాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో రమేష్ బాబు, నియోజకవర్గ క్రీడా కోఆర్డినేటర్ పూర్ణ శరత్‌చంద్ర, మండల కోఆర్డినేటర్లు నిరంజన్ రెడ్డి, ప్రభాకర్ రావు, జ్యోతిలక్ష్మి, భాను ప్రసాద్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి ఇంటి వద్దకే పౌష్టికాహారం

చంద్రగిరి(తిరుపతి రూరల్): వైఎస్సార్ సంపూర్ణ పోషన్ పథకం కింద అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఆగస్టు 2వ తేది నుంచి గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దకే పౌష్టికాహారం అందిస్తామని సీడీపీవో ప్రదీప అన్నారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రానికి వచ్చి పౌష్టికాహారం తిని పోవాలంటే ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారికి ఇంటి వద్దకే పౌష్టికాహారం అందించాలని ఆదేశించారని తెలిపారు. ఆగస్టు ఒకటవ తేదీ నుంచి 7 తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగమణి, సుభాషిణి పాల్గొన్నారు.

నీతిమాలిన రాజకీయాలు మానుకోండి



మాట్లాడుతున్న తలారి రాజేంద్ర

తిరుపతి కల్చరల్: తిరుపతి నగర అభివృద్ధే లక్ష్యంగా డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి దృఢ సంకల్పంతో పనిచేస్తున్నారని, ప్రతిపక్ష నేతలు నీతిమాలిన రాజకీయాలు చేస్తూ అభివృద్ధికి అడ్డుతగలడం మానుకోవాలని వైఎస్సార్ సీపీ సేవాదళ్ రీజనల్ కో ఆర్డినేటర్ తలారి రాజేంద్ర తెలిపారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గతంలో రోడ్లు జలమయం, బురదమయం అంటూ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు నిరసనలు చేపట్టారని తెలిపారు. ఇప్పుడు రోడ్లను అభివృద్ధి చేస్తుంటే అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. అప్పుడు తుడా చైర్మన్‌గా ఉన్న నరసింహ యాదవ్ రోడ్ల అభివృద్ధికి మ్యాపింగ్ చేసి రాళ్లు నాటి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఎస్వీయూలో రోడ్లు నిర్మిస్తే అసాంఘిక కార్యకలాపాలు జరుగుతాయని చెప్పడం దారుణమన్నారు. ఇప్పటికైనా తిరుపతి అభివృద్ధిని అడ్డుకునే కుట్రలను మానుకోవాలని, లేకుంటే తగిన పరిణామాలు తప్పవని హెచ్చరించారు. రాజశేఖర్, కల్లూరి లక్ష్మీరాజ్యం, సిద్ధయ్య, అనంద్ పాల్గొన్నారు.

17 నుంచి సీపీఐ బస్సు యాత్ర

తిరుపతి కల్చరల్: సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 17 నుంచి బస్సు యాత్ర చేపట్టనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి తెలిపారు. ఆయన సోమవారం సాయంత్రం సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నగర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 8న బస్సు యాత్ర ముగింపు సందర్భంగా తిరుపతి నగరంలో 50 వేల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు.

సంచార జాతుల కార్పొరేషన్లకు నిధులు ఇవ్వాలి

తిరుపతి కల్చరల్: సంచార జాతుల ఎంబీసీ, దాసరి, మేదరి, జంగం, వడ్డెర, యాతా, రెడ్డిక వంటి కార్పొరేషన్లకు నిధులు విడుదల చేసి ఆదుకోవాలని సంచార జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాపూరు డోలాకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని సుమారు 70 లక్షలకు పైగా ఉన్న సంచార జాతుల వారు రాష్ట్ర ప్రభుత్వానికి అండగా ఉంటారని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని సంచార జాతుల జన గణన చేపట్టాలని కోరారు. సమావేశంలో సంచార జాతుల అభివృద్ధి మండలి తిరుపతి జిల్లా నేతలు పి.ప్రసాద్, జి.వెంకటసుబ్బయ్య, సానాల గంగాధరం, బి.ఓంకార్, మహిళా కార్యదర్శి ఆకుల సుమతి పాల్గొన్నారు.

ఐఏఎల్ న్యాయవాదుల నిరసన



తిరుపతి లీగల్: మణిపూర్ ఘటనను నిరసిస్తూ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ సంఘం న్యాయవాదులు సోమవారం తిరుపతి కోర్టుల ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలిపారు. మణిపూర్‌లో మహిళలపై జరిగిన దారుణాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఐఏఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయవాది షణ్ముగం యాదవ్ తెలిపారు. ఐఏఎల్ జిల్లా అధ్యక్షుడు రాజమాణిక్యం, న్యాయవాదులు యోగానంద్, వెంకటేష్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నివేళలా అండగా ఉంటాం.. ఆదరించండి



హర్షిత్‌రెడ్డికి హారతిపడుతున్న మహిళలు

రామచంద్రాపురం: ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటామని, రానున్న ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం దేశూరికండ్రిగ, దేశూరికండ్రిగ దళితవాడ, పారకాల్వ, పారకాల్వ దళితవాడలో గడప గడపకూ మీ హర్షిత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడికే పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి, ఎంపీడీవో మహ్మద్ రఫీ, తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు, నాయకులు మహేంద్రరెడ్డి, బాబుయాదవ్, భాస్కర్‌రెడ్డి, రాజేష్, వెంకటేష్, ప్రతాప్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని సోమవారం తెలంగాణ ప్రభుత్వ విప్ భానుప్రసాద్‌రావు, సినీ నటుడు తనికెళ్ల భరణి దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డు, ప్రసాదాలతో సత్కరించారు.

అభివృద్ధిని అడ్డుకుంటే చరిత్ర హీనులుగా మిగులుతారు



వీసీ రాజారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు, విద్యార్థి, ఉద్యోగ సంఘాల నేతలు



అభివృద్ధిని అడ్డుకోకండి అంటూ నినదిస్తున్న విద్యార్థి, ఉద్యోగ సంఘాల నాయకులు

తిరుపతి సిటీ: తిరుపతి నగరంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకుంటే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్వీయూ పరిపాలనా భవనం వద్ద సోమవారం విద్యార్థి సంఘాలు చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తిరుపతిలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు విద్యార్థుల్లో అపోహలను కలిగిస్తున్నారని ఆరోపించారు. నగరంలో ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. రాయలసీమకే తలమానికమైన స్విమ్స్, రుయా వంటి ఆసుపత్రులు ఎస్వీయూ సమీపంలోనే వున్నాయని, నగరానికి వీఐపీల తాకిడి ఎక్కువైనప్పుడు అంబులెన్స్‌లు, ప్రాణాపాయ స్థితిలో వున్న రోగులు ఆసుపత్రులకు చేరుకోవాలంటే ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే యూనివర్సిటీలో రోడ్లను విస్తరించి, ఎన్‌సీసీ నగర్ మీదుగా రోడ్డును పూర్తి స్థాయిలో నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గత టీడీపీ పాలనలోనే తిరుపతి అభివృద్ధికి సంబంధించి మాస్టర్ ప్లాన్ కోసం జీవో నెంబర్ 112ను విడుదల చేశారన్నారు. 2040 వరకు మాస్టర్ ప్లాన్ అమలులో ఉంటుందని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలిచ్చారన్నారు. ఈ విషయం తెలిసినా టీడీపీ, జనసేన నాయకులు రాజకీయ లబ్ధికోసం కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి అపోహలను నమ్మవద్దని ఆయన విద్యార్థులను కోరారు. యూనివర్సిటీ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం రోడ్ల విస్తరణ చేపట్టడాన్ని స్వాగతించాలన్నారు. అనంతరం వీసీ రాజారెడ్డికి వినతి పత్రం సమర్పించి, యూనివర్సిటీ రోడ్ల విస్తరణ, మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణ ప్రణాళికను ఆయనకు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పరదేశి నరేంద్రనాథ్, కో–ఆప్షన్ మెంబర్ ఇమామ్, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ ఇమ్రాన్ బాష, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు మురళీ రెడ్డి, ఎస్వీయూ నాన్ టీచింగ్ యూనియన్ నాయకులు శ్రీనివాస్‌రాజు, యూనివర్సిటీ విద్యార్థి విభాగం నాయకులు ప్రేమ్ కుమార్, ప్రవీణ్, పసుపులేటి సురేష్, వినయ్, ఉదయ్ వంశీ, చంద్ర, అనీల్ కుమార్, డిష్ చంద్ర పాల్గొన్నారు.

నెరవేరిన నాలుగు దశాబ్దాల కళ



ఆర్టీసీ బస్టాండ్‌లో ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- రూ.35 లక్షలతో ఆర్టీసీ బస్టాండ్‌లో ప్లాట్‌ఫామ్ నిర్మాణం
- ప్రారంభించిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల: పాకాల వాసుల నాలుగు దశాబ్దాల కళ సోమవారం నెరవేరింది. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవతో రూ.35 లక్షలతో ఆర్టీసీ బస్టాండ్‌లో చేపట్టిన ప్లాట్‌ఫామ్‌ను సోమవారం వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా ఆయన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రూ.35 లక్షలతో ఆర్టీసీ బస్టాండ్ చుట్టూ ప్రహరీగోడ, మరుగుదొడ్ల నిర్మాణం చేపడతామన్నారు. మండలంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.60 కోట్లకు పైగా నిధులను కేటాయించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఎంపీపీ లోకనాథం, నాయకుడు నంగా బాబురెడ్డి, సర్పంచులు కస్తూరి, కళావతి, సునిత, ఎంపీటీసీ గౌతమి, సురేష్, మహాసముద్రం పట్టాభిరెడ్డి, మునీర్, రమేష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి చంద్రగిరిలో వైద్య శిబిరాలు

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆగస్టు 2వ తేది నుంచి చంద్రగిరి మండలంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, ఎంపీడీవో రమేష్‌బాబు తెలిపారు. వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. గత నెలలో చంద్రగిరి మండలంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాల్లో 30 వేల మందికి పైగా పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో మరోసారి మండలంలో పలు ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. 2న పనపాకం పంచాయతీలో మెడికల్ క్యాంపు ప్రారంభమవుతుందని 11వ తేదీ చంద్రగిరిలో జరిగే మెడికల్ క్యాంపుతో పూర్తి అవుతాయని తెలియజేశారు.

పారిశుద్ధ్య సిబ్బందిపై టీడీపీ వర్గీయుల దాడి



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

- ఫాగింగ్ చేసినందుకు ఆగ్రహం
- గతంలోనూ సిబ్బందిపై దాడి
- నిరసనకు దిగిన సిబ్బంది

తిరుపతి క్రైం: విధుల్లో ఉన్న పారిశుద్ధ్య సిబ్బందిపై నలుగురు టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడిన ఘటన సోమవారం రాత్రి తిమ్మినాయుడుపాలెంలో చోటుచేసుకుంది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది కథనం మేరకు.. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజా ఆధ్వర్యంలో మరో ఇద్దరు సిబ్బంది తిమ్మనాయుడుపాలెం ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఫాగింగ్ చేపట్టారు. ఈ క్రమంలో ఖాళీ స్థలంలో మద్యం సేవిస్తున్న నలుగురు టీడీపీ వర్గీయుల వైపు పొగ వెళ్లడంతో ఆగ్రహించి కట్టెలతో దాడి చేశారు. ముగ్గురూ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ అక్కడికి చేరుకున్నారు. వారిని తన కారులో రుయా ఆసుపత్రికి తరలించారు. ఆకతాయిలను శిక్షించాలని కోరుతూ పారిశుద్ధ్య కార్మికుల అసోసియేషన్ నాయకులు, సిబ్బంది సుమారు 150 మంది తిమ్మినాయుడుపాలెం రోడ్డుపై బైఠాయించారు. గతంలోనూ మలేరియా సిబ్బందిపై కొంతమంది ఆకతాయిలు దాడి చేసిన విషయం తెలిసిందే. అధికారులు కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సిబ్బంది కోరుతున్నారు.

వైభవంగా కావమ్మ మారయ్య ఉత్సవాలు



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

తిరుపతి మంగళం: తిరుపతి నెహ్రూనగర్ జ్యోతి థియేటర్ వద్ద వెలసిన కావమ్మ ఆలయంలో కావమ్మ, మారయ్య ఉత్సవాలను ఆలయ ధర్మకర్త కట్టా జయరామ్‌యాదవ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆర్.సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీకావమ్మ మారయ్యలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పుష్పపల్లకిలో కొలువుదీర్చి నెహ్రూనగర్‌లో ఊరేగించారు. సోమవారం తెల్లవారు జామున వందలాది మంది భక్తులు పసుపు బట్టలు ధరించి అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్పొరేటర్ సీకే రేవతి, ఆలయ కమిటీ నాయకులు ప్రభాకర్ యాదవ్, రవి, బాలయ్య, తిమ్మారెడ్డి, రవిశంకర్, నాగరాజు, రమణయ్య,శ్రీనివాసులు, కట్టా మోహన్‌యాదవ్, మల్లికార్జుననాయుడు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధంకండి

తిరుపతి కల్చరల్: ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు క్విట్ ఇండియా స్ఫూర్తితో సన్నద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు పిలుపునిచ్చారు. గంధమనేని శివయ్య భవన్‌లో సోమ వారం ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విజయవాడలో 9వ తేదీన కార్మిక శ్రామిక మహా గర్జన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో కార్మిక వర్గం పాల్గొనేలా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని కార్మికులను సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 6, 7 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా స్కూటర్ ర్యాలీలు, 8వ తేదీన మానవహారాలు ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నేతలు వెంకటసుబ్బయ్య, రాధాకృష్ణమూర్తి, కొండలరావు, నాగ సుబ్బారెడ్డి, లలితమ్మ, కేతారి రాధాకృష్ణ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

తిరుపతి కల్చరల్: మణిపూర్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గత నెల 28న సత్యసాయి జిల్లాలో ప్రారంభించిన పోరు యాత్ర సోమవారం తిరుపతికి చేరుకుంది. యాత్రకు ఐద్వా నేతలుబాలాజీ కాలనీలోని జ్యోతిరావ్ పూలే సర్కిల్‌లో ఘనంగా స్వాగతం పలికారు. పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మహిళలపై దాడులు పెరిగాయన్నారు. వాటిని నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. మణిపూర్‌లో మహిళల్ని నగ్నంగా ఊరేగించడాన్ని వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సావిత్రి, మస్తాన్, బి.శివకుమారి, ఎం.జయంతి, సాయిలక్ష్మి, లావణ్య, హేమలత, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు వి.జయలక్ష్మి, మంజుల, రత్నమ్మ, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.జయచంద్ర, జిల్లా కార్యదర్శి సుమన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

రషీద్ సేవలు అభినందనీయం



రషీద్‌ను సత్కరిస్తున్న ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు, అధికారులు

తిరుపతి రూరల్: ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా ఉద్యోగ విరమణ చేసిన ఎస్ హెచ్ రషీద్ సేవలు అభినందనీయమని ఆ సంస్థ డైరెక్టర్లు ఎన్‌వీఎస్ సుబ్బరాజు, శివప్రసాద రెడ్డి కొనియాడారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ శిక్షణ కేంద్రంలో సోమవారం రషీద్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఏపీఎస్పీడీసీఎల్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగపు జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న సందర్భంలో ఆయన తన బృందంతో కలిసి ఆన్‌లైన్ హెచ్‌టీ బిల్లింగ్, ఎస్ఏపీ, ఈ–ఆఫీస్‌ను విజయవాడ, గుంటూరులో స్కాడా సెంటర్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేశారని తెలిపారు. రషీద్ మాట్లాడుతూ విధుల నిర్వహణలో తనకు సహకరించిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.